# పార్వతి - చెలికత్తెల సంవాదం

ఘల్లు ఘల్లున పాద గజ్జెలందెలు మ్రోయ
కలహంస నడకాల కలికీ ఎక్కడికే?

జడలోనూ గంగానూ ధరియించుకొన్నట్టి
జగములేలే సాంబశివుని సన్నిధికే.

బొడ్డూ మల్లెలు జాజి దండాలు మెడనిండ
అందామెరిగిన జగదాంబా ఎక్కడికే?

అందాము వీభూతీ అలరూ గంధామూ
నలచీన నీలకంఠేశు సన్నిధికే.

తళతళమనూ రత్నతాటంకములూ మెరయ
పసిడీమండలమూల పణతీ ఎక్కడికే?

కలియుగ జన్మమూ గలశివుడైనట్టీ
గురులైన శంభుశంకరునీ సన్నిధికే.

హెచ్చుపాపటా బొట్టూ రత్నాకిరీటమ్ము
ఏమమ్మ కరుణా కటాక్షీ ఎక్కడికే?

కడుపెద్ద రుద్రాక్ష మెడలో హారమూదాల్చి
నందీనెక్కినా జగధీశు సన్నిధికే.

ముఖమూన చిరునవ్వుకల ఎరుపూ కుంకుమా
రేఖా వెలిసెడు లోకామాతా ఎక్కడికే?

కంఠాన కాలకూటమ్ము ధరియించుకు
మండాలామేలే జగధీశు సన్నిధికే.

చెంగావి చీరలూచెంగూనా జారంగా
రంగైనా నవమోహనాంగీ ఎక్కడికే?

చంద్రుని శిరసూనా ధరియించుకొన్నట్టి
మండలామేలే నందీశు సన్నిధికే.

సన్నంపు నడుమూపై బిళ్ళాలా ఒడ్డాణము
మెరిసేటి బంగారూ బొమ్మ ఎక్కడికే?

కన్నూలు మూడూ భుజంబూలారూ
అంబాలుగల అర్ధనారీశు సన్నిధికే.